బడిపంతులు గోడు!

నేనే! నేనే! సుబ్బారాయుడు పంతుల్ని నేనే!... రండి... కూర్చోండి... గుంటూరు నుంచి వస్తున్నారా!... ఎక్కడి గుంటూరు ఎక్కడికథ!... నేను హయ్యరు చదవటం కోసం వెళ్ళినపుడు - 1915 లో - ఇంత పట్టణం లేదు. ఆ పల్లె చెరువు, ఆ ఎఱ్ఱ చెరువు, ఆ పిచ్చికల గుంటా తప్ప!... పెరిగిపోయింది.... పట్టణం పెరిగిపోయింది... ఇప్పటికీ వున్నదా పిచ్చికల గుంట?.. ఉన్నది!... ఉండకెక్కడికి పోతుందీ?...ఉంటే వుంటుంది.

(పిల్లలవైపు తిరిగి) అరేయ్ బడుద్ధాయిలూ! గొడవ చెయ్యకండి... కాస పెద్దమనిషితో మాటాడుతున్నాను... నోరెత్తారంటే వీపు చీరేస్తాను సుమా!... సైలెన్స్.

ఆఁ... నేను ఇప్పటి వాణ్ణా!....బందరు గాలివానకు పారాడుతుండేవాణ్ణట!... ఇస్కూలు సర్వీసు 40 ఏళ్లనుంచి...తలనెరిసింది ...చత్వారంవచ్చి పాతికేళ్లు! .నాదగ్గర ఓనమాలు దిద్దుకున్నవాళ్ళు ఇపుడు నౌకరీల్లో వున్నారు... గుంటూరు రైలుగేటు దగ్గర వుంటాడే, బుర్రమీసాల కానిస్టేబులు - వాడు నాదగ్గర చదివినవాడే!.. అరండల్ పేటలో పూటకూళ్లు పెడుతున్న ఓబయ్యకు నేను అక్షరాభ్యాసం చేశాను! ... మా ఫిర్కా నుంచి రిజర్వుసీటుకు ఎం ఎల్.ఏ గా ఎన్నికోబడ్డ జకరయ్య నాదగ్గర గుణింతం నేర్చుకున్నాడు! ... అందరిలో మా గురుభక్తి ఇంకా వున్నది వాడొక్కడికే... మొన్న కర్నూలు పోబోయే ముందు ఒక బుట్టెడు గోరుచిక్కుడుకాయలూ ఒక బూడిద గుమ్మడికాయా తెచ్చి ఇచ్చాడు!......వాడికేం...వాడి చేతుల్లో మహారాజ యోగం వున్నది...... వాడు రేపు హైదరాబాదు పోతాట్టగా!...

రామ! రామ! ఈ పిలకాయలకు చదువు చెప్పటం కాదుగాని నా ఉసురు నాకు తీస్తున్నది...తల్లప్రాణం తోకకొస్తున్నది...ఁ..పగవాడికైనా వద్దు బాబూ ఈ చెర! ఇంతకంటె ముష్టి చెంబు చేత పుచ్చుకొని నాలుగు వీధులు తిరిగి రావటం మంచిది...ఒక గంగిరెద్దును వెంటతోలుకొని నాలుగూళ్లు తిరగటం మంచిది...తట్ట నెత్తి పెట్టుకొని మట్టి మొయ్యడం మంచిది......

(పిల్లలవైపు తిరిగి) ఒరేయ్! సోమలింగం! చర్మాలు వలుస్తాను వెధవా!... కామాక్షి తల్లో పువ్వు లాగేస్తావేం!... గాడిదా!...

ఊఁ. వట్టి వానరమూకండీ!...కాళ్లూ చేతులు వూరుకోవు...ఒకటే కాకిగోల!... చెవులు దిబ్బడపడిపోతున్నయ్......వాణ్ణి వీడు గిల్లా, వీణ్ణి వాడు గిల్లా ... ఈ చింత బరికె చేతులో వున్నది కాబట్టి ఈమాత్రం కూచున్నారు......ఏ చెట్టుకొమ్మదో గాని మాంచి బిగువుగా వున్నది.. ఇది కొత్తగా తెచ్చినరోజున — కొత్త కలం బాగా రాస్తుందో లేదో చూచినట్లు — బెత్తం పటుత్వం పరీక్ష చేద్దామని వరసబెట్టి అందర్నీ బాదుకుంటూ వచ్చాను... మొన్నాటినుంచీ కొస్త దారిలోకి వచ్చారు......పోట్ల ఎద్దుల్ని నడిపించినట్లే వీళ్ళను నడిపించాలి...

మన్నవ గిరిధరరావు

(పిల్లలవైపు తిరిగి) ఒరేయ్ మాధవరావ్! ఒంటేలు బెల్లు కొట్టూ!...(గంట మోగుతుంది.)... పోతున్నారు వెధవలు తుప్పిగంతులేసుకుంటూ!...ఆయ్...ఈ మొత్తదగ్గర ఎవరూ ధార కార్చకూడదూ... దూరంగా పొండీ..

అమ్మయ్య!...ఒక రెండు నిముషాల పాటు తెరిపిచిక్కింది... (చెవులమీద చేతులు పెట్టుకొని)... ఏం చెప్పమంటారు బడి పంతులుగోడు!...అయినా మాగోడు వినేదెవరు?...మీది కాలేజా!...మీ కేం అదృష్టవంతులు!

నాకంటె ఆ ద్రౌపది నయం. ఆమెకు ఐదుగురు మాత్రమే వున్నారు. నాకు తలలో జుట్టంతమంది వున్నారు!

మొదటివాడు స్కూళ్ళ ఇన్స్పెక్టరు ... మూడు నెలలకొకసారి వేంచేస్తుంటాడు. అతని వెంట - అంగూపెదుగాని - బ్రోకర్ లాంటి జవానొకడు వస్తాడు. ఫలహారాలతో సహా జవానుకూడ నివేదన చెయ్యాలి... అన్నంలోకి ఏ ఏ కూరలు చేయాలో, ఏ ఏ పిండివంటలు చెయ్యాలో, ఏమి టిఫిన్ పెట్టాలో ఆ జవాను బయటికి పిల్చి మాకు చెపుతాడు! ... తడవకు 5 రూపాయలు చొప్పున మేం వాళ్ళకు సమర్పించుకోవాలి ... జవానువల్లె కన్నుగీటితే ఇన్స్పెక్టరు 'గుడ్' అని రాసిపోతాడు. మేమిచ్చిన కాఫీలో పంచదార తగ్గినా సరే మా నోట చారెడు బూడిద పోసి పోతాడు!

ద్వితీయుడు అద్వితీయుడైన మా మేనేజరు. ఆయన సొంతబడి ఇది. ఉదయమూ సాయంకాలమూ బడిని పర్యవేక్షించి పోతాడు. వచ్చినపుడల్లా బడితోటలోకి వెళ్ళి ఎన్ని కాకరకాయలు కాసిందీ, ఎన్ని వంకాయలు కాసిందీ లెఖ్ఖ చూచుకొని పోతాడు నిన్న కనుపించిన బెండకాయ ఇవాళ కనపడకపోతే మామీద ధాంధూం అని లేస్తుంటాడు... నెలకు నాకు వచ్చే రాళ్ళు 26 రూపాయలు. అందులో మూడు రూపాయలు మేనేజరుగారు మినహాయించుకొని మిగతాది చేతులో పెడతాడు! సంతకం మాత్రం అక్షరాలా ఇరవై ఆరు రూపాయలు పుచ్చుకున్నట్టు వ్రాయించుకుంటాడు.. ఎప్పుడైనా ఒక్క చాక్ పీసు ఇప్పించమని కబురుచేసే "చాలుచాల్లే... చెప్పే సరుకంతా కొల్లబోవటం లేదులే" అని కస్సుబుస్సులాడుతాడు!

(పిల్లలు చీమల మాదిరిగా నాలుగువైపుల నుంచీ వచ్చి కూచుంటారు.) (పిల్లలవైపు తిరిగి) సైలెన్స్...అరేయ్...మాధవరావ్ ?...ఎక్కాలు చెప్పించరా...కాదు కాదు ...కూచో.. అందరూ రేపటి పాఠం చూచి రాత రాయండీ.. బాగా రాయాలి...అక్షరాలు ముత్యాలల్లే వుండాలి...ఊఁ... రాయండి.

ఇకపోతే మా మూడవసాధుడు హెడ్ మాస్టరు. మా బడిలో నేనో, లేక అన్నిటా ఇంతేనో గాని తలబిరుసు గలవాడు హెడ్మాస్టరుగా వుంటాడు...రెండో టీచరు నోరుపడిపోయేటట్లు పాఠాలు చెప్పాలనీ తాను అతని మీద స్వారీ చేయాలనీ అనుకుంటాడు...ఆయన చస్తే పాఠాలు చెప్పడు. సంతకం పారేసి నాదగ్గరకు వచ్చి

"పిల్లకాయలచేత తోటకునీళ్లు పోయించండీ నేను అటు గేదెకు మేతవేసి వస్తాను" అని వెళుతాడు. ఇహ మళ్లీ రాడు... మేనేజరు గారింటికి వెళ్లి ఆయన కొడుక్కి ప్రైవేటు చెపుతూ కూచుంటాడు ... ఆ కుఱ్ఱవెధవను థర్డుఫారంలో చేరుస్తాడుట! సరేనని ఈ అరవైమంది వానరుల్నీ నేను మళ్లిస్తూ కూచుంటాను.

(పిల్లల వైపు తిరిగి) అరేయ్! పోలాయ్! పేగులు తోడుతాను వెధవా!...ఆ అమ్మాయ్ జడపుచ్చుకుని లాగుతావ్?...కూచో... అరేయ్ ..గొడ్లకాడికెళ్లే వాళ్లెవరు? స్టాండప్ ...సిట్...స్టాం డ్...ఊ...లైను తప్పకుండా వెళ్లండి...

ఊ: ఇహ నా నాలుగవ "ప్రాణేశ్వరుడు" నేను తాడుకట్టిన నాంచారమ్మ ఇసుకలో నుంచి తైలాన్ని తీయవచ్చునేమో గాని ఆమె పెదిమమీద నవ్వును తెప్పించలేం. ఆమెను పెండ్లాడటం నా అదృష్టమనీ, నన్ను పెళ్లాడటం ఆమె దురదృష్టమనీ నాంచారమ్మ కనిపెట్టిన సిద్ధాంతం. మేనేజరిచ్చిన 28 రూపాయలూ తీసుకెళ్ళి నేరుగా ఆమెకు సమర్పించుకుంటాను. ముక్కుపొడుం కొనుక్కోటానికి ఒక్క అణా ఇవ్వమంటే గంటె కాలుస్తాను జాగ్రత్త అంటుంది. చక్క పలుకుపెట్టవే తిండి తిన్నానంటే నాలుగు కందిగింజలు చేతిలో విదుల్చుతుంది. బడి పంతులుకు భార్యగా ఉండటంకంటె, తిన టానికున్న విధవముండ మేలని కొత్తసామెత ప్రవచించింది. ఉన్న దుంపగా కుచేలుడి సంతతిమాదిరిగా నలుగురు ఆడపిల్లలు పుట్టారు. వాళ్ల తలలకు రాయడానికి కొబ్బరి నూనె లేదంటే నమ్మండి!

తెల్లవెంట్రుక లుండవు

(GOVT REGD).

రంగులనుచూచి మోసపోవద్దు. అది తాత్కాలికము మా సువాసన "మన్ మోహిని హేర్ ఆయిల్" అనేక వనమూలికలతో ఆయుర్వేద పద్ధతిలో తయారైనది. 60సం॥ల వయస్సువరకు వెండ్రుకలను నల్లగా వుంచును. ఇదిగాక మెదడుకు చల్లదనము నిచ్చును. ఉన్మాదము, తలనొప్పి వగైరా జబ్బుల రానీయదు. "జ్ఞాపకశక్తి"ని కంటిచూపును వృద్ధిచేయును. కొద్దిగా నెరసివుంటే ఒక పీసా రు. 5-0-0; 3 పీసాలు రు. 12-0-0 సగము నెరసివుంటే ఒక పీసా రు. 6-0-0. 3 పీసాలు రు. 15/- పూర్తిగ నెరసివుంటే ఒక పీసా రు. 7/-లు 3 పీసాలు రు. 18/- లు. పని చేయలేదని ఋజువుపర్చిన పూర్తి సొమ్ము వాపసు చేయబడును. కోరినవారికి పూచీ.

GENERAL LABORATORIES,
(P. W) P.O. Rajdhanwar (H. Bhag.).

జన్మకో శివరాత్రి అన్నట్లు మా మొహాలు కాస్త తేటగావుండేది దసరాపండక్కి. లేని నవ్వు తెచ్చుకొని, చొక్కా చినుగులు ఉత్తరీయంకింద దాచిపెట్టి, టైరు చెప్పులు వేసుకొని, పిల్లల్ని అడిలించుకుంటూ వస్తుంటాం...పప్పుబెల్లాలు పిల్లలకోసం అని వారనుకుంటారు...మేమూ వాటికోసమే మొహాము వాచిపోతున్నాం...నామటుకు నేను పసిపిల్లవాడిలాగా ఇంటింటికీ వెళ్ళినప్పుడు దోసెడు దోసెడు పప్పుబెల్లాలు తింటుంటాను. ఏడాదినుంచివున్న ఆకలిని ఆ పదిరోజుల్లో కాస్త శాంతపరుస్తాను...ఆ పప్పుబెల్లాలను ఇంటికిగూడ మూటకట్టుకొని తీసుకురాలేదని నాంచారమ్మ మూతి ముడుచుకొని కూచుంటుంది. ఆ పదిరోజులూ చేతిలోకి నెయ్యి వెయ్యనుపొమ్మని శిక్ష విధించింది!...మా హెడ్‌మాస్టరుగారు మాత్రం ఈ పదిరోజులూ అంతా తన ఖజాన వేసుకొని మోస్తానంటాడు. ప్రతిపిల్లవాడికీ తాను స్వయంగా పాఠంచెపుతున్నట్లు స్టంట్లు వేస్తాడు!...పిల్లకాయల ఇళ్ళకుపోయినపుడు వాళ్లిచ్చే కానుకలన్నీ కోటుజేబులో వేసుకొని వస్తాడు. అందులో తను సగము తీసుకొని కటాక్షవీక్షణాలు పారేస్తూ నాకు సగం పైకం ఇస్తాడు...దున్నే రోజులో దేశంమీదికిపోయి కోతలరోజుల్లో కొడవలిపట్టుకొని రావడమంటే ఇదేగా!

(పిల్లలవైపుతిరిగి) అరేయ్...ఎవ్రరా కక్కడా...సోమలింగం...పెద్దగంట కొట్రా...టైమయ్యేవుంటుంది... ఇంకా ఇంతసేపా...టైము కావస్తుంటుంది... కొట్టుకొట్టూ...(గంట గణగణ వినబడుతుంది.) ఆఁ...అబ్బాయిలూ అమ్మాయిలూ స్టాండ్...ఇవ్వాళశనివారం...సాయంత్రం బడిలేదు...రేపు ఆదివారం సెలవ...ఎల్లుండి పొద్దున్నే రండి.. పొండి...లైను తప్పించండంటే వీపుమోగుతుంది జాగ్రత్త.. (పిల్లలంతా వెళ్లిపోతారు)

ఆఁ...బతకలేక బడిపంతులంటారు... కాదుకాదు. చావలేక బడిపంతులని అనాలి...ఎండెక్కుతున్నది...లోపల ఆత్మారాముడు గోలపెడుతున్నాడు... ఇప్పటికింకా మా నాంచారమ్మ పొయిమీద ఎసరు ఎక్కించివుండదు...రామ రామ! కృష్ణకృష్ణ!...ఇపుడే ఇంటికివెళితే నలుగురుపిల్లలూ కానులివ్వమని వేధిస్తారు... కాస్త అటు రామమందిరందాక వెళ్లివస్తాను. అక్కడ గాలికి తిరిగేవాళ్లంతాచేరి చతుర్ముఖపారాయణం చేస్తూవుంటారు.... నావగ్గర పిక్కల్లేవుగా! నన్ను ఆడనివ్వరు...ఊరికే పక్కనవుండి చూసి సంతోషిస్తుంటాను...వెళ్ళివస్తాను...అప్పుడప్పుడు వస్తూవుండండి! ★

ఆశావాది

రాజుగారి గుర్రాలశాలలో పని చేసేవాడొకడు ఖూనీ చేసి రాజుగారిచే విచారణలో ఉరిశిక్ష విధించబడ్డాడు. తీర్పయిన తర్వాత "మహాప్రభూ! నా దొక మనవి చిత్తగించండి. నాకు గుఱ్ఱాన్ని ఆకాశమార్గాన ఎగిరించడం చాతనవును. ఒక్క సంవత్సరము గడువిస్తే మీ పంచకళ్యాణి ఆకాశాన పయనింపచేటట్లు చేస్తాను. అలా చేయలేకపోతే నా శిరస్సును ఏలినవారికొప్పగించుకొంటాను," అని వేడుకొన్నాడు. రాజు కూడా "సరే చూద్దాం. అలాగే కానిమ్మ"న్నాడు. మర్నాటి నుంచి గుర్రానికి శిక్షణ ప్రారంభమయింది. అశ్వశిక్షకుడు తర్ఫీదిస్తుండగా అతని స్నేహితుడొకడువచ్చి "ఒరే, నిజంగా నీవు ఆ గుర్రాన్ని ఎగిరించగలవా?" అని అడిగాడు. వాడు "నా మొఖం! గుఱ్ఱమెలా ఎగురుతుంది? ఈ మిషతో ఒక సంవత్సరం నా ఉరిశిక్ష వాయిదాపడింది. ఈ సంవత్సరం లోపల ఎన్నైనా జరగవచ్చు. ఈ రాజు మరణించవచ్చు. లేదా నేను చనిపోవచ్చు. లేదా యీ గుర్రం చనిపోవచ్చు. ఈ మూడూ కాకపోతే ఈలోపల గుర్రమే ఎగరడం నేర్చుకోవచ్చు!" అన్నాడు నవ్వుతూ.

—ఎ. పి. రంగారావు.